# ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం



బాల్కొండలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ, నవంబర్ 15 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి , మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**వేల్పూర్‌లో..**

వేల్పూర్, నవంబర్ 15 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలువాలని, వేముల ప్రశాంత్‌రెడ్డిని మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. ప్రచారంలో ఆర్టీఏ సభ్యుడు రేగుల్ల రాములు, రాకేశ్‌చంద్ర, సర్పంచ్ మహేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఏర్గట్ల మండలంలో..**

ఏర్గట్ల, నవంబర్ 15: ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గంతోపాటు గుమ్మిర్యాల్ గ్రామంలో మంత్రి వేముల చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి వేముల ప్రశాంత్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో పార్టీ నాయకుడు నీరటి నరేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేల్పూర్ మండల కేంద్రంలో..



ఏర్గట్ల మండలం గుమ్మిర్యాలలో..

## బీఆర్ఎస్‌లోకి వలసల జోరు

**మంత్రి వేముల సమక్షంలో చేరికలు**



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి వేముల

వేల్పూర్, నవంబర్ 15: బీఆర్ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు, యువకులు మంత్రి వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామం నుంచి టీపీసీసీ రాష్ట్ర ప్రతినిధి, సొసైటీ మాజీ చైర్మన్ క్యాతం గంగారెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ గడ్డం ముత్యంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల చిన్నారెడ్డి, రిక్కల రవి, కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వెంచిర్యాల్ గ్రామంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు పాశపు నర్సారెడ్డి, సామ శ్రీనివాస్, వార్డు మెంబర్ గడ్డం రాజేశ్వర్, కార్యకర్తలు, సోన్‌పేట్ గ్రామానికి చెందిన క్రేజీ బాయ్స్ ఫ్రీడమ్ యూనిటీ యూత్, యువజన సంఘాల సభ్యులు, ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘ సభ్యులు గులాబీ పార్టీలో చేరారు.వేల్పూర్ మండలం పడిగెల్ గ్రామానికి చెందిన రాజారపు మురళితోపాటు పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ గ్రామానికి చెందిన యువకులు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ బీఆర్ఎస్‌లో చేరారు. ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన వొల్లెంగుల మల్లేశ్, కార్యకర్తలు కాంగ్రెస్ నుంచి తిరిగి సొంత గూటికి చేరారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు**

వేంపల్లి గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం, మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన యశోద, కృష్ణ, గొర్రెల పెంపకందారుల సంఘం వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి.

## ధాన్యం సేకరణ త్వరగా పూర్తిచేయాలి

- రైతులకు డబ్బులు అందేలా చూడాలి
- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

భీమ్‌గల్, నవంబర్ 15 : రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి త్వరితగతిన వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని చేంగల్, బడాభీమ్‌గల్, భీమ్‌గల్, బాబాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీవో సింహాచలం, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయ్ డీఎంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో 177 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. సేకరించిన ధాన్యంలో 50 శాతం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేసి, రైతులకు డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



బడాభీమ్‌గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

## నేడు వేముల పర్యటన

వేల్పూర్, నవంబర్ 15: బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, 10.30 గంటలకు బషీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. సాయంత్రం 7 గంటలకు ముప్కాల్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

## వరద కాలువలో కొండచిలువ



కమ్మర్‌పల్లి వరదకాలువలో లభ్యమైన కొండచిలువ

కమ్మర్‌పల్లి, నవంబర్ 15 : మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ వరదకాలువలో స్థానిక మత్స్యకారుల వలకు కొండచిలువ చిక్కింది. కాలువలో ఒకరోజు ముందు వేసిన కండ్రి వలలో కొండచిలువ చిక్కి మృతి చెందింది. బుధవారం ఉదయం మత్స్యకారులు వల తీసి చూడగా కొండచిలువ చిక్కి మృతి చెంది ఉన్నది. కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూర్‌లోని పాతచెరువులో కూడా గత మంగళవారం మత్స్యకారుల వలకు కొండచిలువ చిక్కింది.

## బాల్కొండ బరిలో ఎనిమిది మంది

భీమ్‌గల్, నవంబర్ 15 : బాల్కొండ అసెంబ్లీ స్థానానికి 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా తెలిపారు. మొత్తంలో బరిలో తొమ్మిది మంది ఉండగా నామినేషన్ ఉపసంహరణకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. నామినేషన్ ఉపసంహరణలో భాగంగా బుధవారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఈర్ల సాయిబాబు తన నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్థానానికి పోటీలో మిగిలిన ఎనిమిది అభ్యర్థులకు నేడు గుర్తులు కేటాయిస్తామని ఆమె తెలిపారు.

## నేటి నుంచి ఓటరు స్లిప్పులను అందజేయాలి

బాల్కొండ/ముప్కాల్, నవంబర్ 15: ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్లిప్పులను అందజేయాలని బాల్కొండ, ముప్కాల్ ఎంపీడీవోలు సంతోష్, దామోదర్ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు తహసీల్ కార్యాలయ సిబ్బంది, సెక్టోరల్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశాల్లో తహసీల్దార్లు శ్రీధర్, వనజారాణి, నాయబ్, డిప్యూటీ తహసీల్దార్లు వినోద్, శ్రీకాంత్, సెక్టోరల్ అధికారులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో బీఎల్వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో